# కొట్టుమిషన్

'అబ్బబ్బ ఏమిటీ ఈ పాడు రొద?' ప్రశాంతంగా నిద్ర పోవడానికికూడా నోచుకోలేదు ఈ పట్నవాసపు బ్రతుకుల్లో. మంచం మీద అటూ ఇటూ కదులుతూనే విసుక్కుంది సరోజ.

"ఏమిటీ సరూ నిద్రలేవకుండానే ఈ రకం సణుగుడు. భగవంతుణ్ణి స్మరించుకుని లేస్తే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది" అన్నాడు సుదర్శనం.

మీకలాగే ఉంటుంది. మధ్యాహ్నం కాస్త నడుం వాల్చటానికి ఎలాగా కుదరదు. పాలవాడి పొలికేక వినిపించేదాకా మెలకువ రాకపోతే హాయిగాఉండును".

"పోనీలెద్దూ ఇంకాసేపటికి వాడెలానూ రానేవస్తాడు. కాస్త ముందుగానే మనం లేచిపోతే ఏం పోయింది". సరోజ విసుగును తగ్గించాలని తన బద్ధకానికి వీడ్కోలు ఇచ్చాడు సుదర్శనం. గభాలున మంచందిగి ప్రక్క గదిలో పడుకున్న పిల్లల్ని లేపడానికి

ఉపక్రమించాడు, "లేవండర్రా పరీక్షలు దగ్గరకు వచ్చేస్తున్నాయి. చదువుకుందురుగాని". ప్రదీప్, రూపలకి మెలుకువ వచ్చినా మళ్ళీ కళ్లు మూసేసుకున్నారు. "ఈ పని మంచిదికాదు. ఎంత తెల్లవారు ఝామునే లేస్తే అంత ఆరోగ్యంతెలుసా. చూడండి పక్క వాటాలో పాపలిద్దరూ అప్పుడే ఎలా చదువుకుంటున్నారో" ఇద్దరి చేతులూ పట్టుకొని లేపి కూర్చోపెట్టాడు.

"లేచిపోతున్నాములే నాన్న మాకేమీ బద్ధకంలేదు. ఐదు నిమిషాల్లో చదువుకోవడం మొదలుపెట్టేయమూ" అంటూ చెంగున పెరట్లోకి పరుగెట్టారు. పక్కవాటాలో అమ్మాయిలు చదివేసుకుంటున్నారంటే వీళ్ళకి ఎంతఉత్సాహం పుట్టుకొచ్చింది. చదువులో పోటీపడటం మంచిదే. అందుకే ఆ మహానుభావుడు గురజాడ అన్నాడు. "పూను స్పర్ధలు విద్యలందే" అని. సన్నగా ఆ పాటపాడు కుంటూ అతను ముఖం కడుక్కోవటానికి పెరట్లోకి నడిచాడు. సరోజ ఇదంతా తనకి పాఠం చెప్పడం కోసమే అని తను సురేఖని విసుక్కుంటున్నదని ఇలా చేశారు. ఆవిడంటే ఏదో అభిమానం కాబోలు. సమయం దొరికితే చాలు ఆవిడ పనితనాన్ని గురించి ఉపన్యాసాలు దంచేస్తారు. తను మాత్రం చేసుకోవడంలేదూ ఇంటెడు పని. ఎప్పుడైనా మెచ్చుకున్న పాపాన్ని పోయారా. అంతే పొరుగింటి పుల్లకూర రుచి. చిటపటలాడుతూనే మంచం దిగింది.

"చూసేవా సరూ పాలవాడు పొలికేక వేయవలసి రాలేదు. వాడు రాగానే పరుగెట్టి ప్రదీప్ తెచ్చేశాడు. ఇక మేమంతా రెడీ. పాలు రెడీ, ఇక నువ్వే". భర్తను చురచుర చూసింది. ఆ చూపులో అంతరార్థం బాగా తెలుసు సుదర్శనానికి. ఈ రోజు అంతా సరోజ ఇలాగే కోపాన్ని ప్రదర్శిస్తుంది. ఏమిటో పక్కింటి సురేఖ కుట్టు

మిషను కొనుక్కొన్నప్పటి నించీ ఈవిడ ధోరణి వింతగామారింది. ఎందుకంత ఈర్ష్య. ఆవిడ ఎప్పుడు మిషను కుట్టుకున్నా ఆ చిన్న శబ్దమే ఏదో పెద్దమోత మోగినట్లు చిరాకువడిపోతుంది. నిజానికి చెవులప్పగించి వింటేగాని ఆ శబ్దం సరిగ్గా వినిపించనే వినిపించదు. ఈవిడకి ఈమాత్రం శబ్దానికి నిద్రాభంగం అయిపోయింది. దాచు కోలేని అసూయ. నిన్న మొన్నటిదాకా ఇద్దరి మధ్యా ఎంత స్నేహం అని. కమ్మగా ఏ పదార్ధమైనా తయారు చేసిందంటే చాలు సురేఖకి ఇచ్చివస్తానంది. పాపలు లొట్టలేస్తూ తింటారు అంటూ పట్టుకెళ్ళి పదినిమిషాలు బాతాఖానీ వేసిగానీ వచ్చేదిగాదు. ఏమిటీ మనసులలో ఈ విచిత్ర మనస్తత్వాలు. కొంపతీసి ఆడవాళ్ళకి అసూయ ఎక్కువ అన్నమాట నిజంకాదు కదా! సరోజ మౌనంగా కాఫీ అక్కడ పెట్టి వెళ్ళిపోయింది. పిల్లలిద్దరూ పుస్తకాలు తెరిచి కూర్చోవటంతో కాఫీ తాగి వాళ్లని చదివించటంలో లీనం అయిపోయాడు.

"రూపా రిక్షా వచ్చేసింది. నువ్వు తయారైపోయావా". ఉషా, శోభలు స్కూల్ బాగులతో టిఫిన్ బాక్సులతో ఉషారుగా వచ్చారు.

"ఇదిగో అయిపోయింది. వచ్చేస్తున్నా అమ్మా తొందరగా అల్లేయవే" తల్లి చేతికి రిబ్బన్ అందించింది రూప. ఉష, శోభలని తేరిపార చూసింది. ఏడున్నరవరకూ ఆ మోత ఆగనేలేదు.

ఒక్క అరగంటలోనే పిల్లలని ఎలా తెమిల్చేసింది సురేఖ అనుకుంటూనే రూపకి టిఫిన్‌బాక్స్ సర్ది అందించింది.

"మమ్మీటాటా" అంటూ ఉషా శోభల మధ్య రిక్షాలో కూర్చుని తన బిడ్డ స్కూలుకి కదిలిపోతూంటే సరోజకి ఏదోలా అనిపించింది. ఇక ఇలా ఒకేరిక్షాలో పంపటం మాన్పించేయాలి. రూప ఒక్కతే వెళ్ళలేదాఏమిటి అనుకుంది

"అంటీ....అంటీ ఇవాళ మా చెల్లాయి బర్త్‌డే "తెల్లవారేసరికి స్వీట్స్ పళ్ళెంలో పెట్టుకుని వచ్చారు ఉషా, శోభ. "మంచిదమ్మా" సరోజ ఓ స్వీటు తీసుకుంది. రూప శోభ గౌనుని కన్నార్పకుండా చూస్తూ "భలేబాగుందే నీ గౌను. ఎప్పుడుకొన్నారు మీ నాన్న, నిన్న షాపింగ్‌కి వెళ్ళినప్పుడేనా" అంది. "కాదే రూప నిన్న షాపింగుకి వెళ్ళినప్పుడు గుడ్డమాత్రమే తీసుకున్నాము. రాత్రంతా ఎంత ఓపికగానో. అమ్మ కుట్టింది. పొద్దున్న లేవగానే ఈ డిజైను పూర్తిచేసేసింది". ఆ చిన్నారి కళ్ళల్లో గర్వం తొణికిసలాడింది.

"అమ్మ పాపం ఎంతో రాత్రిదాకా నిద్దరపోలేదు. పొద్దున్నే అమ్మనిలేపడం ఎందుకని నేనే కాఫీ చేసేసి చెల్లాయికి తలంటు చేసేశా" తన పనితానాన్ని చెప్పుకుని ఉష మురిసిపోయింది. స్వీట్సు తింటూ వాళ్లు చెప్పుకుంటున్న కబుర్లు సరోజకు ఒళ్లు మండించాయి.

"కబుర్లు చాల్లే లోపలికి నడుముందు. ఊరు తెల్లరకుండానే ఎక్కడలేని సొద మొదలుపెట్టారు" పిల్లలు ముగ్గురూ ఒక్కసారి బిత్తరపోయారు. తమ వాటాలోకి వెళ్ళిపోతూ "అక్కా అంటీకి ఎందుకే మనమీద కోపంవస్తుంది". ప్రశ్నించింది శోభ

"ఏమోనే నాకేం తెలుసు. ఇదివరకు ఎంతో సరదాగామాట్లాడే సరోజ అంటీ ఇప్పుడు ఎలాగో ఉన్నారు. మనం రూపతో మాట్లాడినప్పుడల్లా పాపం దాన్ని కేకలేస్తున్నారు". శోభ చెవిలో నెమ్మదిగా అంది ఉష. "ఇంక మనం అస్తమాటికీ వెళ్ళొద్దులే. రూప మనింటికి వస్తేనే మాట్లాడదాము" తనూ నెమ్మదిగా అంది శోభ. శోభ, గౌను రేఖాఅంటీ ఎంతోబాగా కుట్టారు. తన పుట్టినరోజు గౌను కూడా అమ్మతో చెప్పి అంటీచేతనే కుట్టించుకోవాలి అని ఉవ్విళ్ళూరిన రూప తల్లి చిరాకు చూడగానే ఏమీ మాట్లాడలేకపోయింది.

"రూపా టైము అవుతోంది స్కూలుకి బయలుదేరుదామా?" తమ ఇంటివైపుగా వచ్చిన రూపనిచూస్తూ అడిగింది శోభ. "ఇవాల్టినించీ నేను వేరే రిక్షాలో వెళుతున్నాను". ఆ మాట చెప్పలేక చెప్పలేక చెప్పింది. శోభ తెల్లబోయింది.

"అంటే మనం కలిసి స్కూలికి...." "ఇంక వెళ్లనివ్వదే మా అమ్మ, నాకొక్కదానికీ వేరే రిక్షా బేరమాడేసింది. పోనీలే స్కూల్లో కలుస్తాంగా".

"అయినా ఒక్కమాటే రూపా. మీ అమ్మగారికి మా మీద కోప మొచ్చింది కదూ ఎందుకే?"

"ఏమో మాకూ ఏమీ తెలీదు. నేనూ అన్నయ్య కూడా అదే అనుకొంటున్నాము. ఎప్పుడూ మీతోకలిసి ఆడుకోమని, చదువుకో మని చెప్పే అమ్మ ఇప్పుడు మనం కలుసుకోవడం చూస్తేనే ఎంత గానో కోప్పడుతోంది. కొడుతోంది కూడా". రూప కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

తన పాపని వేరే రిక్షాలో పంపడం సరోజకి ఏదో విజయం పొందినట్టు అనిపించింది. ఒకప్పుడైతే ఇరుగు పొరుగు ఇళ్లల్లో కాపు రాలు చేసుకుంటున్న వారు ఇంత స్నేహంగా ఉండాలి అన్నట్టు ఆదర్శమైత్రి ఉండేది సరోజ సురేఖల మధ్య. ఏ పని చేసినాఇద్దరూ కలిసి చేసేవారు. ఒక్క పదినిముషాలు ఏ కారణాలవల్ల అయినా ఒకరికొకరు ఎదురుపడకపోతే ఎంతో విలవిలలాడిపోయేవి ఆ రెండు మనసులు. పిల్లలు నలుగురు కలిసి ఆడుకోవటం. చదువు కోవటం చూడముచ్చట ఆ ఇద్దరికీ, భర్తలు ఆఫీసులకి వెళ్లాక కలిసి కబుర్లు చెప్పుకోవటం, పుస్తకాలు చదువుకోవటంతో కాలాన్ని

కరిగించేవారు. సురేఖకి కొత్తదనం అంటే ఇష్టం. ఎక్కడ ఏ కొత్త రకం వంటచూసినా తను వెంటనే తయారు చేయవల్సిందే కుట్టు అల్లికలు ఏవో ఒకటి నేరుస్తూ సరోజకి చూపించి సంబరపడిపోయేది.

"నీకెంత ఓపికే తల్లీ! ఎప్పుడూ ఏదో ఒక పనిచేస్తూ కూర్చుంటావు. నీ బుర్రనిండా ఈ కుట్టు అల్లికలే ఆలోచనలా? అని సరోజ అంటే "అవునే సరూ సమయాన్ని ఎప్పుడూ వృధాచేయకూడదు. దాన్ని ఎప్పుడూ మనచేతుల్లో ఉంచుకోవాలి..." అనేది నవ్వుతూ. సరోజకి ఇలాటి విషయాల్లో కాస్త ఆసక్తితక్కువే. బద్ధకం అయితే కాస్త ఎక్కువపాళ్లు. అందుకే రోజంతా ఏదో ఒక పనితో కొట్టుమిట్టాడే కంటే హాయిగా కాలక్షేపం చేస్తూ విశ్రాంతిగా కూర్చోవటం కోరుకుంటుంది.

ఓ రోజు ఉన్నపాటున సురేఖ భర్తతో బజారుకి బయలుదేరింది. తిరిగివచ్చి సరోజని వంటింట్లో ఉన్నదాన్ని అలా చేయి పుచ్చుకుని లాక్కెళ్ళింది తన ఇంటికి. కొట్టవచ్చినట్టు సరోజ కళ్ళబడ్డ కుట్టు మిషను ఆమెలో ఎన్ని భావాలురేపిందో మాటలతో చెప్పడం కష్టమే. తళ తళా మెరుస్తూ ఇంటికే కొత్త అందాన్ని తెస్తున్న ఆ కుట్టు మిషన్నిచూసి గుడ్లు నిలేసింది. "నిన్ను ఆశ్చర్యపరచాలని ముందు నీతో చెప్పలేదు. వారం రోజులనించీ అనుకుంటున్నాం. కుట్టుమిషను కొనేయాలని. అసలు శ్రీవారే నా ఉత్సాహం చూసి ఆఫీసులో లోను పెట్టి 1500 తీసుకొచ్చారు. ఆ వెంటనే దీనితో మా ఇంటిని అలంకరించేశాము" కుట్టుమిషన్ని అపురూపంగా చూస్తూ అంది. సరోజకి నోట మాట రాలేదు. అయితే ఇక సురేఖ తనతో ఎప్పటిలా గడపదన్న మాట! ఎప్పుడూ ఈ మిషన్‌ముందు కూర్చుని ఏవో కుట్టుకుంటుంటే.... తను ఏదో ఘనకార్యం చేస్తున్నట్టు ఛీ... ఊరికే

గొప్పైపోతుంది. సరోజలోని భావాలు గమనించకుండానే "ఇది రెండు రకాలుగా ఉపయోగించుకోవచ్చు. ఈ ప్లేటు ఇలా పెడితే ఎంబ్రాయిడరీ చేసుకోవచ్చు. ఇక మామూలు బట్టలయితే అన్నీ కుట్టుకోవచ్చు. నాకు కొన్ని కటింగ్స్ రావు. ప్రక్క వీధిలో ఇందిరమ్మ గారింటికెళ్ళి వాళ్ళ కోడలి దగ్గర నేర్చుకోవాలి. మా ఇంట్లో ఉంటే మనిద్దరం కలిసే వాడుకోవచ్చుగా సంతోషంగా చెప్పుకుపోతోంది.

"నీకెప్పుడో చెప్పానుగా! నాకంత ఓపిక లేదు. మా కుక్కర్ కూత పెట్టినట్లుంది. చకచకా వెళ్ళిపోయింది. నిజంగానే కుట్టుమిషను కొనుక్కున్న సంతోషంతో కుట్లు నేర్చుకోవటంతోనే కాలం కరిగి పోతోంది సురేఖకి. సరోజతో ఎక్కువగా కబుర్ల కాలక్షేపం చేయ లేక పోతోంది. దాన్ని మరో విధంగా అర్థం చేసుకుంది సరోజ. కుట్టుమిషను ఇంటికి వచ్చాక సురేఖ ఎంత గర్వపడుతోంది. పొద్దస్త మానం అదే లోకం. తీరిక లేకుండా ఇంత ఉప్పిని దేనికి. అసలు గృహలక్ష్మి ఇల్లు సరిదిద్దుకోవడం సరిపోదూ! అదనంగా ఇవన్నీ ఎందుకు? ఇలా సరోజ ఆలోచిస్తుండగానే మరో విచిత్రం జరిగింది. చుట్టు ప్రక్కల వాళ్ళంతా ఆ ఇంటికి రావడం మొదలుపెట్టారు తమ తమ బట్టలు కుట్టించుకోవడం కోసం. ఎవరి నోట విన్నా సురేఖ ప్రశంసలే! "ఈవిడ ఎంత తెలివైంది. బద్ధకం ఈవిడ ఛాయలకే రాదు. రోజంతా ఇంటి పని చేసుకోవడమే కాక బట్టలు కుట్టి సంపాదిస్తూ ఉంటుంది. వేడినీళ్లకి చల్లనీళ్లు తోడు".

అందరూ సురేఖని మెచ్చుకుంటున్నకొలదీ సరోజ మనస్సులో అదో రకమైన ఈర్ష్య బయలుదేరింది. జాబిలిని మబ్బు మూసినట్లు ఆమెలోని చల్లని స్నేహాన్ని ఆ ఈర్ష్య మరుగుపరిచింది. మాటి

మాటికి సరోజ ధోరణికి విస్తుపోతూనే ఉంది సురేఖ. తన స్నేహితు రాల్లో ఈ మార్పు ఏమిటి? అని జవాబు లేని ప్రశ్న ఆమెను వేధిస్తూంది. ఇప్పుడు రూపని ఉషా, శోభలతో కలిసి స్కూలుకి పంపటం మానేసింది. ఏమిటి ఇది? కొంపదీసి సరోజలో ఈ కోపానికి కుట్టుమిషను కారణంకాదుకదా. ఏమో. ఏది ఏమైనా సరోజ స్నేహం దూరమైనందుకు సురేఖకు బాధగానే ఉంది.

'సరోజా రెండు కాఫీలు తీసుకురా అర్జెంటు' ఆఫీసునుంచీ వస్తూనే అన్నాడు సుదర్శనం. వంట ఇంట్లో ఉన్న సరోజ వరండా లోకి వచ్చింది. "ఎందుకు లేవోయ్ మా వాటాలోకి వెళ్ళి తాగేస్తాను. కాఫీకి ఏం ఉంది. అది మా సురేఖ ఎప్పుడూ ఫ్లాస్కులో సిద్దంగానే ఉంచుతుంది". భర్త పక్కనే కుర్చీలో కూర్చుని అంటున్నాడు సురేష్. సరోజ వంటికి కారం పూసుకున్నట్లయింది. ముఖం చిట్లించి భర్తను చూసి గిర్రున వెనక్కు తిరిగింది.

"అలా అనేస్తావేమిటోయ్ మీ ఇంటికి మా ఇల్లు ఎంత దూర మని, నువ్వుమాత్రం ఎన్నిసార్లు బలవంతం చేసి కాఫీ టిఫినులు పెట్టించలేదు" నవ్వుతూ అన్నాడు సుదర్శనం.

సరేలే నీ మాట ఎందుకు కాదనడం నీతో కలిసి కాఫీ సేవించిన తరువాతే కదులుతాను నేను. తనూ ఫక్కున నవ్వేడు సురేష్. ఇద్దరూ అలా నవ్వుకుంటూ మాట్లాడుకుంటూ ఉంటే సరోజ బాధ తారస్థాయి చేరుతోంది. తప్పదు అన్నట్టు కప్పుల్లో కాఫీ పోసి వరండాలోకి తీసుకువెళ్ళింది. ఏమిటోయ్ మన ఆఫీసర్ నీకేదో సర్టిఫికేట్ పారేశాడట. రామన్న చెప్పాడులే అంటున్నాడు తన భర్త. "దానికేముందిలే ఈ మధ్య అతని చెల్లి పెళ్ళికి అవసరమైన జాకట్లు వగైరా మా ఆవిడ కుట్టి పెట్టింది. అవి బాగున్నాయని, మా ఆవిడ

చవకలో కుట్టిపెట్టిందని అతని సంతోషం. దానికే రామన్న అలా అని ఉంటాడు అలాంటి పొగడ్తలకు నేనేమీ ఉబ్బిపోను. రేఖని అందలం ఎక్కించను". ఆ మాటలు అంటున్నప్పుడు సురేష్ కళ్ళలో గర్వం తొణికిసలాడ్డం మాత్రం సరోజకు కన్పించింది. మౌనంగా కాఫీ అందించి "మీరు ఒక్కసారి వస్తారా పని ఉంది" తీవ్ర కంఠముతో అంది. కాఫీ కప్పు కింద పెట్టి "నీ ఆజ్ఞమేరకు కాఫీ త్రాగాను. మరి వస్తా" వెళ్లిపోయాడు సురేష్.

వీధి తలుపులు వేసి లోపలికి వస్తూనే "ఏమిటి సరూ ఏదో పని అన్నావు".

"పనే! నాలుగు వీధులు వెతికి ఎక్కడైనా ఇల్లు ఖాళీ ఉందేమో చూడండి" అదరిపడ్డాడు సుదర్శనం.

"వీలైనంత తొందరలో మనం ఈ ఇల్లు మార్చేయాలి".

సుదర్శనం పెదవులపై అదో మోస్తరు నవ్వు చోటు చేసుకుంది.

"ఎందుకు సరూ! ఎంతో సదుపాయంగా ఉన్న ఈ ఇల్లు మార్చేద్దాం అంటావు. ఇవాళ రేపు అద్దె ఇళ్ళ అవస్థలు మనకి తెలియనివి కావు కదా". సరోజకి జవాబు దొరకలేదు. ఆమె మౌనాన్ని ఆసరగా తీసుకుని "నాకు తెలుసు నాలుగేళ్లుగా అలవాటై పోయిన ఈ లోగిలి ఎందుకు మారాలనుకుంటున్నావో?"

"అయితే ఆలస్యం ఎందుకు?" పౌరుషంగా అంది.

"కానీ అర్థం తోచడంలేదు కనక". చూడు సరూ! నేను ఒక్క నిజాన్ని నీ ముందు ఉంచుతాను. దానికి నువ్వు వేసే అర్థాన్ని

ఆపాదిస్తే నా మనస్సును బాధ పెట్టిన దానివవుతావు. నిన్న మొన్నటి దాకా సురేఖగారి పట్ల నీకున్న స్నేహం ఈర్ష్యగా మారి శాఖోప శాఖలుగా విస్తరిస్తూంది. నీకు నేను చెప్పక్కర్లేదు కానీ ఇది తప్పు సరూ".

ఆ మాటలకి సరోజ పట్టరాని కోపంతో ఉరిమి చూడడం చూసింది కానీ ఏమీ మాట్లాడలేకపోయింది. ఇల్లు మార్చే ప్రసక్తి మాత్రము మళ్ళీ తీసుకురాలేకపోయింది సంవత్సరం గడిచేపోయినా. తను అనుకున్నది సాధించి ఇంటికి కుట్టుమిషను ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోగలుగుతున్నా దానిని కొనుక్కున్న రోజునించీ ప్రియస్నేహితురాలు సరోజ తనతో మాట్లాడ్డం మానేసి నందుకు మాత్రం సురేఖకి బాధగానే ఉంది. అప్పుడప్పుడు తనే సరోజ ఇంటికి వెళుతోంది. మాటలు కలపడానికి ప్రయత్నిస్తూనే ఉంది. సరోజ ముభావం ఆ స్నేహలతని మళ్ళీ చిగురించ నివ్వ లేదు.

సుదర్శనం హఠాత్తుగా ఆఫీసునుంచి వచ్చేశాడు ఓ మధ్యాహ్నం రెండు గంటలకి. సరోజ తలుపులు బిగించుకుని మరీ గురక పెట్టి నిద్రపోతోంది. అయిదారుసార్లు కాలింగ్ బెల్ మ్రోగించితే కానీ లేచి తలుపు తీయలేదు. తలుపు తెరుస్తూనే–

"అప్పుడే వచ్చేశారేమిటి" బరువు ఎక్కిన కళ్ళతో భర్తను చూస్తూ అంది.

"చెబుతాగానీ నువ్వు ఏమిటి ఇలా నిద్రాదేవిని వరించావు".

"పని అయిపోయింది. మీరు పిల్లలు వచ్చేవేళకి టిఫిన్ చేయ వచ్చు కదా అని విశ్రాంతిగా పడుకున్నాను" ధీమాగా జవాబు

ఇచ్చింది. సుదర్శనం డ్రెస్ మార్చే ప్రయత్నం చేయకుండానే కుర్చీలో కూర్చున్నాడు.

"మంచినీళ్లు తీసుకు రమ్మంటారా" అంది సరోజ. తల ఊపాడు అతను. "సరూ నాకు హైద్రాబాద్‌లో ఓ పెద్ద కంపెనీలో ఇంటర్వ్యూ వచ్చింది. సెలెక్టయితే ఇంతకు మరింత జీతం...."

"అయితే ఇంక ఏం వెళ్ళిరండి. ఎప్పుడు ప్రయాణం?" పట్టరాని ఆనందంతో అడిగింది.

"అదే చిక్కు. నెలాఖరుగా అంతా ఖర్చు అయిపోయింది. నీ దగ్గర ఏమైనా..."

"అబ్బే ఏమీ లేదండీ చిల్లర డబ్బులతో సహా లెఖ్ఖ పెట్టినా ఇరవై రూపాయల కంటే ఉండవేమో. ఏం సరిపోతాయి. మనకి కనీసం ఐదు వందలైనా అర్జెంటుగా కావాలి. వెళితే అక్కడ ఏమి ఖర్చులు ఉంటాయో ఏమో. ఆఫీసులో అందరినీ తెలిసిన మిత్రులని అడిగి చూశాను. ఆశలు వదలుకోవలసిందే అనిపిస్తోంది. భర్త కంఠం బరువుగా పలికింది. భర్త మరింత పెద్ద ఆఫీసరు అయితే ఇంకా హాయిగా మరింత పెద్ద సిటీలో ఉండవచ్చునని కలలు కంటూ ఒక నిమిషంలోనే పొంగులువారిన ఆమె ఆనందం మీద చన్నీళ్లు చిలకరించినట్లు అయింది. భర్త నిరుత్సాహానికి అలా అన వద్దండీ. నేను ప్రయత్నిస్తాను". మరుక్షణం సురేఖ మెదిలింది మనస్సులో. చిల్లర చిల్లరగా ఈపాటికి పెద్ద మొత్తాన్నే కూడేసి ఉంటుంది తనయితే పట్టించుకోలేదు కానీ ఈ మధ్య మాటల్లో పెట్టి చెప్పింది. కుట్టు మిషన్నుంచి వచ్చే ఆదాయాన్ని కొంత వేరే దాస్తున్నాను అని పాపాయిలిద్దరికీ జూకాలు చేయిస్తాను అని. సురేఖ దగ్గర తమకు అవసరమైనంత ఉండే ఉంటుంది సరోజ

ఆలోచనలు వింతగా సురేఖ వైపు పరుగుతీశాయి. సురేఖ తనకు స్నేహితురాలా అయితే తను ఇప్పటివరకూ ఆమెతో ఎలా ప్రవర్తించింది. పలకరిస్తే ముఖం తిప్పుకుంది. మాట కలిపితే పని ఉంది అని దాటేసింది. ఛీ ఛీ ఏమిటి తనూ తన భావాలు. శ్రీవారు అన్నట్టు నిజంగానే తనలో స్నేహం స్థానంలో ఈర్ష్య పేరుకుందా? సరోజ మనస్సు రెండోవైపు ఆలోచించసాగింది. సురేఖ మిషన్ కుడుతున్న శబ్దాలు ఇప్పుడు మోతగా అనిపించడంలేదు సన్నగా శ్రావ్యంగా వినిపిస్తోంది. ఆ శబ్దం ఎప్పుడు ఆగింది గమనించలేదు. కానీ సురేఖ పిలుపుకు ఉలిక్కిపడింది. ఏమిటే సరూ అలా నిలబడ్డావు. నువ్వూ మీ శ్రీవారు కూడా దీర్ఘాలోచనలో మునిగారు— అదేమిటో నాతో చెప్పకూడదూ. స్నేహితురాలి భుజాలు పట్టి ఊపింది సరోజ సందేహించలేదు. విషయం చెప్పేసింది.

"ఈ మాత్రం దానికేనా నేనే ఇస్తాను. నేను దాచింది ఆ మాత్రం ఉండవచ్చులే. కాస్త తక్కువైతే సర్దుకుందురుకాని". సరోజ చేయి పట్టుకుని తన ఇంటి వైపు నడిచింది.

సరోజలో ఎన్నెన్నో భావాలు. ఇన్నాళ్ల తన నడవడికి తనలో తనే కుంచించుకు పోతోంది. ఇంత మంచి నెచ్చెలి ఉండి తను ఇన్నాళ్ళూ ఎందుకలా గడిపింది అని ఆవేదనపడింది. ఇన్నాళ్ళూ తను చీదరించుకున్న కుట్టుమిషన్ ఆమె కళ్లకి దేవతా విగ్రహంలా కనబడింది. డబ్బులెక్క పెట్టి చిల్లరనోట్లు సరోజ చేతిలో ఉంచింది నిర్మలమైన స్నేహంతో నిండు మనస్సుగల సురేఖ. ఆపద్బాంధవిలా దర్శనం ఇస్తున్న కుట్టుమిషన్‌కి మనస్సులోనే నమస్కరించుకొని 'ఎందుకని అడగకు నన్ను క్షమించవే సురేఖా' అంటూ ఆమెను పెనవేసుకుంది ఆత్మీయంగా సరోజ.